క్లుప్తంగా...

కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: గౌడవెల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని బాసిరేగడి ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పవన్‌చందు తెలిపారు. బాసిరేగడి, జ్ఞానాపూర్ పరిధిలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ ఉండదని ఆయన తెలిపారు.

ఆపదలో అండగా సీఎంఆర్‌ఎఫ్



కీసర: ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఉపయోగపడుతుందని నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్, చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధికి చెందిన పి.వి జయలక్ష్మికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.60 వేలకు సంబంధించిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రశాంత్‌నగర్ కాలనీలో నివాసముంటున్న శివకుమార్ అనారోగ్యంతో మృతి చెందాడు. అంత్యక్రియల నిమిత్తం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ యువజన నాయకుడు కౌకుట్ల రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు రూ.81 వేల ఆర్థికసాయం అందజేశారు. కాలనీ అసోషియేషన్ అధ్యక్షుడు కల్లూరి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగుల శ్రీనివాస్ రెడ్డి, కృష్ణాయాదవ్, మహేష్‌యాదవ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పలు సంస్థలతో నర్సింహారెడ్డి కళాశాల ఎంఓయూ



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి కళాశాల ఎక్సెల్లార్, సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ సంస్థలతో ఎంఓయూ కుదుర్చుకుంది. విశాఖపట్నంలో జరిగిన ఐఈఈఈ సమ్మిట్‌లో భాగంగా కళాశాల ఆయా సంస్థలతో ఒప్పందం కుదుర్చుకొని పత్రాలను మార్చుకున్నారు. ఈ ఒప్పందంతో గెస్ట్ లెక్చర్, స్కిల్ డెవలప్‌మెంట్, నూతన ఆవిష్కరణలు వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులతో పాటు అధ్యాపకులకు సైతం ప్రయోజనం కలుగుతుందని కళాశాల యాజమాన్యం తెలిపింది. కార్యక్రమంలో పురుషోత్తం, లక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దేశభక్తి పెంచేందుకే..

ఎమ్మార్‌సీఈలో 'మేరీ మాటీ- మేరా దేశ్'



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌సీఈ కళాశాలలో గురువారం ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మేరీ మాటీ- మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఇంటి నుంచి మట్టి, బియ్యం తీసుకురాగా కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ ఆధ్వర్యంలో కుండల్లో మట్టి, బియ్యాన్ని సేకరించారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకే, దేశ సమగ్రతను పెంచేందుకు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. డీన్ సునీల్, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ రత్న కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆగుతూ.. సాగుతూ.. మూడేళ్లు..

పురపాలికల్లో సమీకృత మార్కెట్లకు గ్రహణం

- మూడేళ్లుగా కొనసాగుతున్న నిర్మాణ పనులు
- 13 వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లకు రూ.39.90 కోట్లు
- 2022 సంక్రాంతి వరకు పూర్తి కావాల్సి ఉన్నా..
- నిధుల లేమితో నత్తనడకన సాగుతున్న పనులు



పీర్జాదిగూడలో..

సాక్షి, మేడ్చల్ జిల్లా: నగర శివారు ప్రజలకు కనీస మౌలిక వసతుల కల్పనలో భాగంగా 13 పురపాలక సంఘాల్లో రెండేళ్ల క్రితం ప్రారంభించిన సమీకృత (వెజ్, నాన్-వెజ్) మార్కెట్ల నిర్మాణ పనులు నత్తకు నడక నేర్పుతున్నాయి. 9 పురపాలికల్లో మొక్కుబడిగా పనులు కొనసాగుతుండగా.. కొంపల్లి, బోడుప్పల్ పురపాలక సంఘాల్లో మాత్రం ప్రారంభ దశలోనే ఉన్నాయి. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా ప్రభుత్వం సమీకృత మార్కెట్ల నిర్మాణాలకు సరిపడా నిధులు విడుదల చేయకపోవడంతో.. పనులు ముందుకు సాగడం లేదు.

మూడేళ్ల క్రితం ప్రారంభం

సమీకృత మార్కెట్ల నిర్మాణానికి దాదాపు మూడేళ్ల క్రితం శ్రీకారం చుట్టారు. వీటి నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయిస్తున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రకటించినా, ఆచరణలో సాధ్యం కాని పరిస్థితి నెలకొంది. దీంతో మార్కెట్లను 2022 సంక్రాంతి వరకు వినియోగంలోకి తేవాలని నిర్ణయించినా, నిధుల లేమితో నత్తకు నడక నేర్పుతున్నాయి. జవహర్‌నగర్, బోడుప్పల్, కొంపల్లి, ఘట్‌కేసర్ పురపాలక సంఘాల్లో సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులు ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి. గుండ్లపోచంపల్లి, తూముకుంట, మేడ్చల్, నాగారం, పోచారం, నిజాంపేట్, దుండిగల్ పురపాలక సంఘాల్లో మార్కెట్ల నిర్మాణం నెమ్మదిగా సాగుతుంటే.. పీర్జాదిగూడ, దమ్మాయిగూడలో పనులు ఒక మోస్తరుగా నడుస్తున్నాయి. సమీకృత మార్కెట్ల నిర్మాణాలు సకాలంలో పూర్తయితే నగరశివారు పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు కూరగాయలు, మాంసం, పండ్లు, ఇతర తినుబండారాలు ఒకే చోట లభించనున్నాయి.

స్థలాన్ని బట్టి నిధుల కేటాయింపు..

పురపాలక పట్టణాల్లో ఎకరం నుంచి రెండు ఎకరాల స్థలంలోపు నిర్మించ తలపెట్టిన సమీకృత మార్కెట్లకు రూ.2 కోట్లు, రెండు ఎకరాలు ఆపైన ఉన్న స్థలంలో నిర్మించే సమీకృత మార్కెట్లకు రూ.4.50 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పురపాలిక యంత్రాంగం ఆయా పట్టణాల్లో సమీకృత మార్కెట్ల భవన నిర్మాణ సముదాయాల్లో భాగంగా షెడ్లు, పార్కింగ్ నిర్మాణ వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులు చేపట్టనున్నారు.

13 పురపాలిక సంఘాల్లో..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాల్లో సమీకృత మార్కెట్ల కోసం అర ఎకరం నుంచి రెండు ఎకరాల చొప్పున 16.82 ఎకరాల స్థలాన్ని అధికార యంత్రాంగం సేకరించింది. భవనాలు, పార్కింగ్ ఇతర వసతుల పనుల నిమిత్తం ప్రభుత్వం రూ.39.90 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. జవహర్‌నగర్, నిజాంపేట్, బోడుప్పల్, పీర్జాదిగూడ కార్పొరేషన్లలో సమీకృత మార్కెట్ల భవన సముదాయాలు, పార్కింగ్ నిర్మాణం కోసం రూ.4.5 కోట్ల చొప్పున నిధులు కేటాయించింది. మేడ్చల్, గుండ్లపోచంపల్లి, కొంపల్లి, దుండిగల్, తూముకుంట, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీల్లో మార్కెట్ల నిర్మాణానికి రూ.2 కోట్ల చొప్పున నిధులు వెచ్చించనున్నారు.

సాక్షి కథనం.. అధికారుల్లో చలనం..

జంగ్ తెలంగాణ 2023



మినీ ట్యాంక్‌బండ్‌పై ఎన్టీఆర్ విగ్రహానికి వేసిన ముసుగు



గోడలపై పార్టీల రాతలను చెరిపేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లిలో ఎన్నికల కోడ్ బేఖాతరు అనే శీర్షికతో గురువారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారుల్లో చలనం వచ్చింది. ఎన్నికల నియమావళిలో భాగంగా గుండ్లపోచంపల్లి మినీ ట్యాంక్‌బండ్‌పై ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు వేసి, పలు పార్టీల జెండాలను తొలగించారు. మున్సిపాలిటీ పరిధిలో పలుచోట్ల రాజకీయ పార్టీలు తమ ప్రచారంలో భాగంగా గోడలపై రాసిన రాతలను మున్సిపల్ సిబ్బంది చెరిపివేశారు.

యూత్ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తాం



రాజుయాదవ్‌కు నియామక పత్రం అందజేస్తూ..

కీసర: మండలంలో యూత్ కాంగ్రెస్ బలోపేతానికి చర్యలు చేపట్టామని, ఇందుకోసం ఆయా గ్రామాల్లో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులను నియమిస్తున్నట్లు కీసర మండల యూత్ అధ్యక్షుడు కందాడి శివరాంరెడ్డి అన్నారు. ఈమేరకు భోగారం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా దుర్గం రాజుయాదవ్, అంకిరెడ్డిపల్లి గ్రామయూత్ అధ్యక్షుడిగా వంశీముదిరాజ్‌ను నియమిస్తూ వారికి నియామక పత్రాలను అందజేశారు. మేడ్చల్ జిల్లా యూత్ అధ్యక్షుడు సుశాంత్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు పొన్నం తరుణ్, తటాకం అభిలాష్ ఆదేశాల మేరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భోగారం గ్రామసర్పంచ్ కవితాజైహింద్‌రెడ్డి, ఉపసర్పంచ్ జానకీరాం, యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.మల్లేష్ యాదవ్, నేతలు బలరాం, నాగరాజు, మల్లేష్, కృష్ణ, అశోక్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రత్నాలయంలో మంత్రి పూజలు



రత్నాలయంలో యాగం కరపత్రాలను విడుదల చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

శామీర్‌పేట్: మండలంలోని అలియాబాద్ రత్నాలయంలో మంత్రి మల్లారెడ్డి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవి నవరాత్రుల సందర్భంగా శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న నవదుర్గ యాగాన్ని జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. యాగం కరపత్రాలను విడుదల చేశారు. రత్నాలయంలోని వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, వేదపండితులు, నాయకులు పాల్గొన్నారు.



చీర్యాల శ్రీలక్ష్మీనృసింహస్వామి సేవలో మాజీ కలెక్టర్ అమయ్‌కుమార్

లక్ష్మీనృసింహస్వామి సేవలో కలెక్టర్

కీసర: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లిన మాజీ కలెక్టర్ అమయ్‌కుమార్ గురువారం చీర్యాల శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. మహామండపంలో వేదపండితులు ఆయనకు స్వామివారి ఆశీర్వచనంతో పాటు మహా ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ చైర్మన్ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

సీఎం సభను విజయవంతం చేయాలి

మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్

మేడ్చల్: గుండ్లపోచంపల్లిలో ఈ నెల 18వ తేదీన నిర్వహించే సీఎం కేసీఆర్ పాల్గొనే ఎన్నికల బహిరంగసభను నియోజకవర్గ ప్రజలు విజయవంతం చేయాలని మంత్రి మల్లారెడ్డి కోరారు. బహిరంగ సభ స్థలిని ఆయన కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సభాస్థలి వద్ద నియోజకవర్గ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో జనసమీకరణ చేసి సభను విజయవంతం చేయాలని కోరారు. 70 వేల మందితో సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సభలో పాల్గొనే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.



ఎమ్మెల్యే వివేకానందతో కలిసి బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి మల్లారెడ్డి

అనురాగ్‌లో ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంపు



ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఎన్‌ఎస్‌ఎస్ సెల్ ఆధ్వర్యంలో గురువారం యూనివర్సిటీ స్థాయి ప్రీ రిపబ్లిక్ పరేడ్ క్యాంపు ఎంపికలు నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ హైదరాబాద్ ప్రాంతీయ డైరెక్టర్ ఎం.రామకృష్ణ, టీఎస్ రాష్ట్ర ఎన్‌ఎస్‌ఎస్ సెల్ అధికారి గీత, ప్రాంతీయ డైరెక్టర్ కార్యాలయం సిబ్బంది సంజయ్, ఎన్‌ఎస్‌ఎస్ మహిళా వలంటీర్లకు ఎంపిక పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ సీఈఓ నీలిమా, స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ విజయ్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లేశ్ ఎంపికలో పాల్గొన్న మహిళా వలంటీర్లను అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నవీన్, కిరణ్‌కుమార్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

డబ్బు, మద్యం తరలింపుపై నిఘా

మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్లు విజయేంద్రరెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల నేపథ్యంలో మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లావ్యాప్తంగా అక్రమంగా డబ్బులు, మద్యం తరలించకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్లు విజయేంద్రరెడ్డి(రెవెన్యూ) అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) అభిషేక్, రెవెన్యూ అధికారి హరిప్రియ, డీసీపీ జానకితో కలిసి జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల నోడల్ అధికారులు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, ఎక్సైజ్ శాఖ, పోలీసు శాఖలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రూ.50 వేలకంటే ఎక్కువ డబ్బులు తీసుకెళ్లరాదని, ఒకవేళ తీసుకెళ్తే సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, లేనిపక్షంలో నగదు సీజ్ చేస్తామని చెప్పారు. ఎన్నికల కమిషన్ సూచనలు ఖచ్చితంగా పాటించేలా చూడాలన్నారు. జిల్లావ్యాప్తంగా పటిష్ట బందోబస్తు, నిఘా ఏర్పాటు చేయాల్సిందిగా సూచించారు. ఎన్నికల కమిషన్ సూచించిన విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పని చేసి ప్రశాంత వాతావరణంలో జిల్లాలో ఎన్నికలు జరిగేలా సమన్వయంతో పని చేయాలని సమావేశంలో కోరారు. సమావేశంలో జిల్లాలోని నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, పోలీసు శాఖ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖల అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో రూ.7.2 లక్షలు పట్టివేత

ఘట్‌కేసర్: ఎన్నికల నియమావళిలో భాగంగా స్థానిక పోలీసులు ఘట్‌కేసర్‌లోని అండర్ పాస్, అంబేడ్కర్ చౌరస్తాలో గురువారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. ఘట్‌కేసర్‌కు చెందిన స్వర్ణ రవికుమార్ కారులో రూ.7.2 లక్షలు లభించాయి. లెక్కలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి, డీఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

బెల్ట్‌షాప్‌పై ఎస్‌ఓటీ పోలీసుల దాడి

కీసర: తిమ్మాయిపల్లి గ్రామంలో బెల్ట్‌షాప్‌పై మల్కాజిగిరి ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి సుమారు రూ.లక్ష మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. తిమ్మాయిపల్లి గ్రామంలో మల్లారపు పరమేష్ బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నాడనే సమాచారం మేరకు బుధవారం రాత్రి మల్కాజిగిరి ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. రూ.లక్ష విలువ చేసే మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కీసర పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీ

ఎన్నికల సందర్భంగా కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. గురువారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద సీఐ వెంకటయ్య ఆధ్వర్యంలో వాహనాలను చెకింగ్ చేస్తుండగా వాహనాల్లో దొరికిన రూ.5 లక్షలను స్వాధీనం చేసుకొని ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటయ్య మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాలను ప్రజలు పాటించాలన్నారు.

నాగారంలో హుక్కా సెంటర్‌పై పోలీసుల దాడి

కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంపల్లి చౌరస్తాలో హుక్కా సెంటర్‌పై పోలీసులు దాడిచేసి నిర్వాహకులను అరెస్టు చేశారు. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి చౌరస్తాది కేఫ్ 46 రెస్టారెంట్‌లో అనుమతి లేకుండా హుక్కా సెంటర్ నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు బుధవారం రాత్రి పోలీసులు దాడిచేసి హుక్కా సెంటర్ నిర్వాహకులు సాయికుమార్, బ్రమేంద్రను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయం



మర్రి రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న మహిళలు, చిత్రంలో కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అన్ని వర్గాల ప్రజలు బీఆర్‌ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారని మల్కాజిగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం అల్వాల్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాసంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయని ఆయన అన్నారు. అనంతరం పలువురు మహిళలు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నేమూరి శ్రీధర్‌గౌడ్, మల్లేష్‌గౌడ్ కన్నా, చంద్రశేఖర్, ప్రేమ్‌కుమార్, సతీష్, మాధవి, నందిని, అమిత, కాలనీ వాసులు మహేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, విశ్వనాథం, మోహన్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ శ్రేణులు

మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని ఏకలవ్య గోపాల్‌నగర్ కాలనీలో పలువురు కాంగ్రెస్ నాయకులు మల్కాజిగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, విజయ్, ఆనంద్‌రావు, నర్సింగ్ యాదవ్, వినోద్, పూర్ణచందర్, అనిల్, సంతోష్‌కుమార్, మదన్, సాయికుమార్, మనోజ్, ఉపేందర్ ఉన్నారు.

అంతర్ కళాశాలల ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్ షురూ



ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శనలు తిలకిస్తున్న డైరెక్టర్ రామస్వామిరెడ్డి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల(మెయిన్)లో విశేష్-2కె 23 పేరిట రెండు రోజుల పాటు జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న అంతర్ కళాశాలల ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్ గురువారం ప్రారంభమైంది. కళాశాల డైరెక్టర్ రామస్వామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ ఇంజినీరింగ్ పరిజ్ఞానాన్ని ఉపయోగించి చేపట్టే ప్రయోగాలు సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రాజెక్టు ఎగ్జిబిషన్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ, వృద్ధులు, వికలాంగులకు ఉపయోగపడే, ప్రమాదాలు జరకుండా హెచ్చరికలు జారీ చేసేవి వంటి 400 ప్రాజెక్టులను ప్రదర్శించినట్లు తెలిపారు. వాటిలో ఉత్తమమైన వాటికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసేలా, పేటెంట్ హక్కులు పొందేలా కళాశాల సహకారం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్లు సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్, సెల్విన్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలు

పలు పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నుంచి పాఠశాలలకు బతుకమ్మ, దసరా సెలవులు కావడంతో విద్యార్థినులు తమ పాఠశాలల్లో సంబరాలను జరుపుకున్నారు. మహిళా ఉపాధ్యాయులు, బాలికలు సంప్రదాయ దుస్తులతో ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు పండగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు.



మూడుచింతలపల్లి ప్రాథమిక పాఠశాలలో..



అత్వెల్లి పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న బాలికలు



అవుషాపూర్ మెరిట్ స్కూల్లో..